క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గూడూరురూరల్: పట్టణంలోని మాళవ్యనగర్‌లో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. గురుకులంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 2023–24 సంవత్సరంలో ప్రవేశానికి మూడో తరగతిలో 40 సీట్లు, నాలుగో తరగతిలో 32 సీట్లు, ఐదో తరగతిలో 18 సీట్లు, ఆరో తరగతిలో 18 సీట్లు, ఎనిమిదో తరగతిలో 2 సీట్లు, ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఎంపిక నెల్లూరులోని ఐటీడీఏ పీఓ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 9441766714, 9949395233 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హెల్పర్ పోస్టుకు..

కోట: మండలంలోని గూడలి అరుంధతీయవాడ అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ మునికుమారి తెలిపారు. శుక్రవారం సీడీపీఓ తన కార్యాలయంలో మాట్లాడుతూ పదో తరగతి పాసై, స్థానికులై ఉండి, 35 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని చెప్పారు.

అర్హులందరికీ రైతుభరోసా నగదు

సైదాపురం: అర్హులైన రైతులందరికీ ఈ నెలలో రైతు భరోసా నిధులను ప్రభుత్వం వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తుందని ఏఓ హైమావతి తెలిపారు. మండలంలోని కలిచేడు, ఊటుకూరు, తురిమెర్ల రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా పథకం ద్వారా మండలంలోని 6,669 మంది రైతలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. సుమారు రూ.9 కోట్ల రూపాయలను నిధులను ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు.

ఘనంగా రాజమునీశ్వర స్వామి ఉత్సవాలు

చిట్టమూరు: మండలంలోని ఎల్లూరులో ఉన్న రాజమునీశ్వర స్వామి నాగార్పమ్మ దేవస్థానంలో వార్షిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. దీక్ష వస్త్రధారణ, దీక్ష కంకణ ధారణ, అఖండ దీపస్థాన పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయాన్ని విద్యుదీపాలంకరణతో శోభాయమానంగా అలంకరించారు.

విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

కలువాయి: ఇంటర్మీడియట్, పదో తరగతి ఫెయిల్ అయిన వారికి సప్లిమెంటరీ పరీక్షల కోసం శిక్షణ ఇస్తున్నట్లు కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జనార్దనరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు పరీక్షలు రాసి రెగ్యులర్ విద్యార్థులతో పాటు కళాశాలల్లో చేరవచ్చన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఇదే పాఠశాలలో బాలికలకు ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

దక్కిలి: విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఈఓ కే వెంకటేశ్వర్లు తెలిపారు. జగనన్న విద్యా కానుక నాలుగో విడత కింద విద్యార్థులకు 3,370 బ్యాగ్‌లు, నోటు పుస్తకాలు, బెల్టులు, యూనిఫామ్, షూస్, సాక్సులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ప్రజలు తిలకించేందుకు గురుకుల పాఠశాలలో అందుబాటులో ఉంచామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. మండల నోడల్ అధికారి ఎస్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన సదస్సు

సైదాపురం: మండల సమాఖ్య కార్యాలయంలో లోకోస్ యాప్‌పై జరుగుతున్న అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏపీఎం రాధ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతుల్లో యాప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామని చెప్పారు. యాప్‌లో సభ్యుల ప్రొఫైల్ ఎలా నమోదు చేయాలన్న విషయంపై కూడా సమగ్రంగా అవగాహన కల్పించామన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

రాపూరు: విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తులసీరాం పేర్కొన్నారు. రాపూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.



చింతవరం అంబేద్కర్ కూడలిలో రోడ్డుపైనే ఆగి ఉన్న లారీలు

దారి వదలరు..

దండించేవారు లేరు!

నిత్యం రోడ్డుపైనే సిలికా లారీల పార్కింగ్.. దీనికితోడు రోడ్డు ఆక్రమణలు.. వెరసి ట్రాఫిక్ చిక్కులు.. అడిగే నాథుడు, దండించే వారు లేరు. వాహన చోదకుల సహనానికి పరీక్ష.. ఇదీ తీర ప్రాంతంలోని చిల్లకూరు మండలం చింతవరం అంబేడ్కర్ కూడలిలో దుస్థితి.

- నిత్యం రహదారిపైనే భారీ వాహనాలు
- తేలిక, ద్విచక్ర వాహన చోదకులకు తప్పని తిప్పలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని సిలికా గనులకు వెళ్లే భారీ వాహనాలు, లోడ్‌తో వచ్చే వాహనాలు చింతవరం అంబేడ్కర్ కూడలిలో నడిరోడ్డుపైనే ఆపివేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించడానికి తేలిక పాటి, ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం భారీ వాహనాలు నడిరోడ్డుపైనే పార్కింగ్ చేసి, డ్రైవర్లు అక్కడ నుంచి వెళ్లిపోతున్నారని, అయినా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోందని వారు వాపోతున్నారు. చింతవరం సర్కిల్‌లో అలా ఉంటే పక్కనే ఉన్న ఆస్పత్రికి వెళ్లే దారిలోనూ, జెడ్పీ ఉన్నత పాఠశాల గేటు ముందు కూడా లారీలను నిలిపివేస్తున్నారు. దీనికి తోడు బయట ప్రాంతాల వారు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు చేస్తుండడంతో డబుల్ రోడ్డు కుచించుకు పోతోంది. దీంతో ఎదురుగా లారీ వస్తే పక్కకు వెళ్లే వీలు లేకుండా పోతుంది. దీంతో కూడలిలో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకుని, పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో చింతవరం అంబేడ్కర్ కూడలిలో ఆక్రమణలను తొలగించి, భారీ వాహనాలు ఆ ప్రాంతంలో నిలపకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



చింతవరంలోని అంబేడ్కర్ కూడలిలో నిత్యం భారీ వాహనాలు ఆపి వేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఫలితంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు వెళ్లాలంటే చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోంది. గతంలో పోలీసులు ఇక్కడ నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్పుడు వాహనాలు నిలిపే వారు కాదు. కానీ అవి పని చేయక పోవడంతో లారీ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు దృష్టి పెడితే వాహన చోదకులకు ఇబ్బందులు తప్పుతాయి.

– శ్రీనివాసులు, మోమిడి, చిల్లకూరు మండలం

ట్రాఫిక్ ఇక్కట్లను తొలగిస్తాం



బల్లవోలు, చింతవరం, వరగలి, మోమిడి ప్రాంతాల నుంచి సిలికా లారీలు వస్తుంటాయి. వీరు ఎక్కువగా చింతవరం అంబేడ్కర్ కూడలిలో ఆపి వేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రత్యేకదృష్టి పెట్టడంతోపాటు సిబ్బందిని నియమించేలా చర్యలు చేపడతాం. త్వరలోనే కూడలిలో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగిస్తాం.

– గోపాల్, ఎస్‌ఐ, చిల్లకూరు

నేడు విద్యుత్ అంతరాయం

వెంకటగిరి: పట్టణంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వెంకటగిరి ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లె మండలాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట పట్టణంలోని మన్నేముత్తేరి విద్యుత్ సబ్‌స్టేషన్, చెంగాళమ్మ ఆలయం సమీపంలో ఉన్న మరో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం పట్టణంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ ఖాదర్‌బాషా తెలిపారు. కోళ్లమిట్ట, డీఓఎస్ కాలనీ, రాజీవ్‌నగర్, రాఘవయ్యపేట, బాపూజీ కాలనీ, సూళ్లూరు, బాపూజీ వీధి, కచ్చేరివీధి, గాండ్లవీధి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి



ప్రసాద్(ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయపడిన అవలంబేటి ప్రసాద్(52) నెల్లూరులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం ప్రసాద్ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి..సంక్షేమ ప్రదాత జగన్



లబ్ధిదారుడికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేటలోని పార్కువీధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని, చుక్కల భూములను గుర్తించి రైతులకు ఇవ్వడమంటే సామాన్యమైన పని కాదన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని పనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారని చెప్పారు. బాపూజీవీధి, పార్కువీధి, కచ్చేరివీధుల్లో రోడ్లు విస్తరించి, డ్రైనేజీని నిర్మించి అభివృద్ధి చేస్తానని చెప్పారు. పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరేంద్రకుమార్, వైస్ చైర్మన్లు చిన్ని సత్యనారాయణ, పోలూరు పద్మ మిల్టన్, స్వామిరెడ్డి, తుపాకులు ప్రసాద్, అలవల సురేష్, అయితా శ్రీధర్, కౌన్సిలర్లు, మీజూరు రామకృష్ణారెడ్డి, పీ విజయలక్ష్మి, పీ మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

గూడూరురూరల్: చిన్న, సన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చని ఏపీఓ గిరి తెలిపారు. మిట్టాత్మకూరు, రామలింగాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో పండ్ల తోటల సంరక్షణకు మూడేళ్ల పాటు నగదు చెల్లించనున్నట్లు తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు రెవెన్యూ అధికారుల వద్ద ధ్రువ పత్రాలను తీసుకుని దరఖాస్తు చేసుకుంటే నిమ్మ, మామిడి, మునగ, దానిమ్మ తదితర ఉద్యాన పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు మజ్జిగను పంపిణీ చేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ ఎస్‌బీసీఎస్ బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. మొత్తం 54 మంది విద్యార్థులకు టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 8 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ అధికారి కిషంధర్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

గడప..గడపలో అపూర్వ ఆదరణ



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: మండలంలోని పారవోలు పంచాయతీలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి గడప గడపలో అపూర్వ ఆదరణ లభించింది. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్యస్పందన లభించింది. స్థానికుల నుంచి సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సావదానంగా వింటూ వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. తొలుత పారవోలు దళితవాడలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, సదారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆ పంచాయతీలోని పారవోలు దళితవాడ, కొత్తూరు, బాలసముద్రం, విశ్వనాథపురంలో పర్యటించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సహకరించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాగయ్య, సర్పంచ్ నెల్లూరు అములు, శివయ్య, జేసీఎస్ కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, తోట గణేష్‌రెడ్డి నాయకులు కొండూరు వెంకటరత్నంరాజు, గిరియాదవ్, తిరుమల, భయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరసాలు పండించేలా నాటక ప్రదర్శనలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్కృతి సమ్మేళనం సభ్యులు

గూడూరు: నవ రసాలు పండించేలా నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నామని సంస్కృతి సమ్మేళనం నాటక విభాగం ప్రతినిధి జానా శివయ్య కోరారు. డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్లో ఈ మేరకు జాతీయ నాటక పోటీల పోస్టర్లను శుక్రవారం సంస్కృతి సమ్మేళనం సభ్యులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం కొంత పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో నాటక ప్రదర్శనలకు ఆదరణ కరువైందన్నారు. కానీ ఎన్నో ఒడిదుడుకులను దాటుకుంటూ సంస్కృతి సమ్మేళనం 70 సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. సంస్థ కార్యదర్శి మునిగిరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోల్చితే, గూడూరులో నాటకాలకు ఆదరణ తక్కువగా ఉందనే నానుడి ఉందన్నారు. ఈ ఏడాది అది నిజం కాదనిపించేలా ప్రజలంతా తరలివచ్చి ప్రదర్శనలను తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, శివ సుబ్రమణ్యం, కట్టా మురళీకృష్ణ, జీజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుణ బకాయిలు చెల్లించాలి

కోట: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య తెలిపారు. కోటలో శుక్రవారం రుణాల రికవరీపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందిన వారు, వాహన రుణం తీసుకున్న వారు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



నర్సులను ఘనంగా సత్కరిస్తున్న శ్యామ్‌యాదవ్

గూడూరు: నర్సులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని సౌత్ సెంట్రల్ విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్‌యూసీసీ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. నర్సుల దినోత్సవం సందర్భంగా గూడూరులోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం కేక్ కట్ చేసి, నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు నర్సులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అలాంటి వారిని మనం సత్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ, హెడ్ నర్సులు విజయలక్ష్మి, వజ్రమ్మ, అనిత, మీన, శైలజ, గిరిజ, నాగమణి, హేమలత, విజయ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా, ఆర్‌ఎంఓ సందీప్ శ్రీనివాస్, డాక్టర్ చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఖత్నాను సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

గూడూరు: పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఈ నెల 15వ తేదీన మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామూహిక ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధి రియాజ్ అహ్మద్ కోరారు. షాదీ మంజిల్‌లో నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం నెట్‌వర్క్ కమిటీ సమావేశం నిర్వహించారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఏటా పేద ముస్లిం పిల్లల కోసం నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఖత్నాలో పాల్గొనే వారు ముందుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నిపుణులైన వైద్యులతో ఈ ఖత్నా నిర్వహిస్తామని చెప్పారు. ఖత్నా చేయించుకున్నవారికి ఉచితంగా మందులతోపాటు, పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అబ్దుల్ రహీం, మహబూబ్ బాషా, షానవాజ్, రఫీ, రవూఫ్, గోల్డ్ నాజర్, నజీం, బాబర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

రాపూరు: పెంచలకోనలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. పెంచలకోనలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాలు సమయం ప్రకారం నిర్వహించామన్నారు.

డీవీ సత్రంలో కమ్ముకున్న మేఘాలు



దొరవారిసత్రం: మండలంలో మూడు రోజుల నుంచి ఆకాశం కారు మబ్బులు కమ్ముకున్నాయి. చల్లటి గాలులు వీస్తున్నాయి తప్ప, చినుకు రాలడంలేదు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై గాలులు వీయడంతో జనం ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

నేడు,రేపు ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

గూడూరు: పట్టణంలోని కోటనేటిమిట్టలో ఉన్న కోదండరామాంజనేయస్వామి ఆలయంలో 13, 14 తేదీల్లో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం హనుమజ్జయంతి కరపత్రాలను ఆయన కమిటీ సభ్యులు, ఆలయ పూజారులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 13న ఉదయం విశేష మన్యస్తు హోమం, అనంతరం హనుమాన్ ఛాలీసా పారాయణం, స్వామివారికి పల్లకిసేవ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆదివారం లక్ష తమలపాకులతో లక్షనాగవల్లి పూజ, సాయంత్రం ఆంజనేయస్వామి వారికి పల్లకిసేవ కనుల పండువగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బత్తిన వేణుగోపాల్, సురేంద్రాబు, పెంచలయ్య, రమణయ్య, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు నారాయణస్వామి, సాయిపవన్ పాల్గొన్నారు.

సైదాపురంలో ఏర్పాట్లు

సైదాపురం: మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం వద్ద, పడమరవీధి, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న అంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా జరుపుకునేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెంచలకోనలో రేపు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలోని క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామివారికి ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారి మూలమూర్తికి అభిషేకం, పూలంగి సేవ, 10.30 గంటలకు ఆకుపూజ, సాయంత్రం తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఊరేగించనున్నట్లు తెలిపారు.


ఆర్‌ఎస్ మొబైల్స్‌లో వీఓ ఎక్స్‌90 విడుదల



మొబైల్ ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు, షోరూం అధినేతలు

గూడూరురూరల్: పట్టణంలోని ఆర్‌ఎస్ మొబైల్ షోరూంలో వీఓ కంపెనీ ప్రతినిధులు వీఓ ఎక్స్ 90 సిరీస్ నూతన మోడల్‌ను శుక్రవారం విడుదల చేశారు. నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కొత్త మొబైళ్లను విడుదల చేస్తూ వినియోగదారుల అభిరుచి మేరకు ఈ ఏడాది వీఓ ఎక్స్ 90 సిరీస్‌ను విడుదల చేసింది. పలు రకాలు ఫీచర్లు ఉండే ఈ మొబైల్‌లో 5 జీ టెక్నాలజీతో పాటుగా అధునాతన సాంకేతిక సదుపాయాలు ఉన్నాయని, చిన్న పాటి మినీ కంప్యూటర్‌లా దీనిని ఉపయోగించుకునే వెసులు బాటు ఉందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఆర్‌ఎస్ మొబైల్స్ షోరూం అధినేత మంజులా రాధాకృష్ణ, జానా రమేష్, శ్రీలక్ష్మీ కమ్యూనికేషన్స్ డిస్ట్రిబ్యూటర్ సునీల్, నాగార్జున, ఏఎస్‌ఎం త్రిలోక్, మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

వేడుకగా గరుడ సేవ



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

కలువాయి: దాచూరులోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో 30 అడుగుల రాతి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో జయ, విజయ, రామభక్త హనుమాన్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కళాశాలకు గర్వకారణం



ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్వప్నతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

గూడూరు: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల డిగ్రీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటారన్నారు. బీఎస్సీ ఎంపీసీఎస్ విభాగంలో టీ స్వప్న 9.92 జీపీఏతో యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వై శ్రీనివాసులు, కిరణ్మయి, శ్రీధర్‌శర్మ, మైమూన్, ఝాన్సీరాణి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంకాలపరమేశ్వరికి పొంగళ్లు

కోట: శ్యాంసుందరపురంలో గ్రామదేవత అంకాల పరమేశ్వరి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు గ్రామస్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.